ఆనందం.. ఆహ్లాదం.. ఆరోగ్యం

హుస్నాబాద్ పట్టణంలో నిర్మించిన పార్కు

- పార్కులు అభివృద్ధికి చిహ్నాలు
- పట్టణ ప్రగతి నిధులు కేటాయింపు
- రూ.20లక్షలతో పార్కు నిర్మాణం
- హుస్నాబాద్‌లో ముస్తాబైన పార్కు

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 5 : ఆనందం.. ఆహ్లాదం.. ఆరోగ్యాన్ని ప్రజలందరికీ పంచేది పార్కు. ఒకప్పుడు పెద్ద పట్టణాల్లో మాత్రమే కనిపించే పార్కులు నేడు చిన్నచిన్న పట్టణాల్లో సైతం ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తున్నాయి. పెరుగుతున్న పట్టణీకరణలో యాంత్రికమైన జీవితం గడుపుతున్న ప్రజలు కాస్త సేదతీరేందుకు ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు పార్కులు ఎంతో దోహదపడనున్నాయి. ప్రజలు నివసించే ప్రాంతాల్లో ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పంచడానికి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో పార్కులను నిర్మిస్తున్నది. హుస్నాబాద్‌లో అన్ని హంగులతో నిర్మించిన పార్కు ప్రారంభానికి సిద్ధమైంది.

పట్టణంలోని బస్‌డిపో వెనుక ప్రాంతంలో దాదాపు పదిగుంటల ప్రభుత్వ స్థలంలో పట్టణ ప్రగతికి చెందిన రూ.20లక్షల వ్యయంతో పార్కును నిర్మించారు. పార్కులో పిల్లలు, యువకులు, వృద్ధులు ఇలా కుటుంబమంతా గడిపే విధంగా సౌకర్యాలు కల్పించారు.

పిల్లలు ఆడుకునేందుకు సైతం...

మున్సిపల్ పార్కులో వ్యాయామం చేసేందుకు ఓపెన్ జిమ్‌తోపాటు వాకింగ్‌ట్రాక్ నిర్మించారు. మానసిక ప్రశాంతతకు యోగా చేసుకునే విధంగా ప్రత్యేక వేదికను సైతం ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకోవడానికి వివిధ రకాల ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. బోనం ఎత్తుకున్న మహిళ, బతుకమ్మలు, జాతీయపక్షి నెమలిని పోలిన చెట్ల ఆకృతితో పార్కును చూడ ముచ్చటగా రూపొందించారు.

పార్కులో ఐదువేల మొక్కలు....

పార్కులో భారీ సంఖ్యలో చెట్లను పెంచుతున్నారు. దాదాపు ఐదువేల వరకు మొక్కలను నాటారు. పార్కు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతోపాటు చుట్టూ పూల మొక్కలను సైతం నాలుగు దిక్కుల్లో నాటారు.

మొక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం

ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడానికి బస్‌డిపో వెనక ప్రాంతంలో పార్కును నిర్మించాం. పార్కులో పిల్లల ఆట స్థలం, వాకింగ్ ట్రాక్, వ్యాయామం చేయడానికి ఓపెన్ జిమ్ నిర్మించాం. ప్రజలకు ఉపయోగపడేవిధంగా పార్కును తీర్చిదిద్దిన ప్రజాప్రతినిధులు, అధికారులకు అభినందనలు.

- వొడితెల సతీశ్‌కుమార్ ఎమ్మెల్యే హుస్నాబాద్

అందరూ ఆరోగ్యంగా ఉండాలి

పట్టణ ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనే భావనతో పార్కును నిర్మించాం. ప్రభుత్వ స్థలాలను కాపాడుతూ ప్రజలకు ఉపయోగపడే వాటిని నిర్మిస్తున్నాం. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సహకారంతో పార్కును నిర్మించాం. పట్టణంలో మరిన్ని పార్కులు నిర్మిస్తాం.

- రజితావెంకన్న, చైర్‌పర్సన్ మున్సిపాలిటీ

హుస్నాబాద్‌టౌన్: పార్కులో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్, వాకింగ్‌ట్రాక్

పేద విద్యార్థులకు ఇంగ్లీష్ విద్య కావాలి

■ పుట్టినరోజు వేడుకల్లో ప్రొఫెసర్ కంచె ఐలయ్య షెఫర్డ్

మాట్లాడుతున్న ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ఆస్క్ సొసైటీ చైర్మన్ సత్తయ్య

రామచంద్రాపురం, అక్టోబర్ 5 : దేశంలో పేద విద్యార్థులకు ఇంగ్లీష్ విద్యను అందుబాటులోకి తేవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నదని ప్రొఫెసర్ కంచెఐలయ్య షెఫర్డ్ అన్నారు. గురువారం తెల్లాపూర్ లోని ఆస్క్ ఎడ్యుకేషనల్ సొసైటీ కేంద్రంలో కంచె ఐలయ్య పుట్టిరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంచె ఐలయ్య మాట్లాడుతూ ఇంగ్లీష్ విద్య అందుబాటులో లేకపోవడంతో పేద విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. జ్యోతిబాపూలే, అంబేద్కర్ స్ఫూర్తితో పేద విద్యార్థులకు ఇంగ్లీష్ విద్యను చేరువ చేసేందుకు అమృతసత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా సామాజిక శాస్త్రాలతోపాటు స్పోకెన్ ఇంగ్లీష్, డేటా సైన్స్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నదన్నారు. ఆస్క్ ఎడ్యుకేషన్ సొసైటీలో 20 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారని, ఇప్పటికీ 20 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఆస్క్ సొసైటీలో 45 సీట్లకు దేశవ్యాప్తంగా 500 దరఖాస్తులు వచ్చాయని, వీరిలో 45 మంది విద్యార్థులను ఎంపిక చేసి, నెల రోజులపాటు ఉచిత శిక్షణ, భోజనం, బస్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్క్ ఎడ్యుకేషనర్ సొసైటీ చైర్మన్ సత్తయ్య, వైస్‌చైర్మన్ అమృత, కౌన్సిలర్, ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్, డైరెక్టర్ సుదర్శన్, కోఆర్డినేటర్ మణికంఠ, ప్యాకల్టీ అయేషా ఉన్నారు.

భారత వ్యవసాయ పరిశోధన మండలిలో

కడ్పల్ విద్యార్థికి ఫెలోషిప్

గొల్ల వెంకటేశ్

సిర్గాపూర్, అక్టోబర్ 5 : భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ న్యూఢిల్లీలో వ్యవసాయ ఇంజినీరింగ్ మాస్టర్స్‌లో ఫెలోషిప్‌ను సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామానికి చెందిన గొల్ల రాములు కుమారుడు వెంకటేశ్ సాధించాడు. రైతు కుటుంబంలో పుట్టి, కష్టపడి ఉన్నత చదువులు చదవడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గొల్ల వెంకటేశ్ కడ్పల్‌లోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేశాడు. టీఎస్ఎర్ఎస్ లింగంపల్లిలో 9.7 జీపీఏతో టెన్త్ పాసయ్యాడు. తర్వాతా ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో పాలిటెక్నికల్ కోర్సులో సీటు సాధించి, 2018లో పూర్తి చేశారు. సంగారెడ్డి ఇంజినీర్ కళాశాలలో బీటెక్ ప్రవేశ పరీక్షల్లో 7వ ర్యాంకు సాధించి, 2022లోగా అగ్రి ఇంజినీర్ పూర్తి చేశాడు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి నిర్వహించే ఆర్ ఇండియా ఫెలోషిప్ పరీక్షలో 5వ ర్యాంకు సాధించాడు. దేశంలోనే అత్యున్నత భారత వ్యవసాయ పరిశోధన సంస్థలో ఇంజినీరింగ్ మాస్టర్స్‌లో వెంకటేశ్ ఫిలోషిప్ అర్హత దక్కించుకున్నాడు. సీనియర్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆచార్య, స్థానికులు గురువారం వెంకటేశ్‌ను అభినందించారు.

కాంగ్రెస్‌కు వెంకట్‌గౌడ్ రాజీనామా

చిన్నశంకరంపేట, అక్టోబర్ 5 : మండలంలో కాంగ్రెస్ నాయకుల రాజీనామాల పర్వం కొనసాగుతున్నది. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమణ, అంబాజీపేట ఎంపీటీసీ, మైనంపల్లి హన్మంతరావు స్వగ్రామం కొర్విపల్లికి చెందిన జయమ్మతోపాటు కొంతమంది నాయకులు కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా, కాంగ్రెస్ పార్టీ చిన్నశంకరంపేట పట్టణాధ్యక్షుడు సుంకరి వెంకట్‌గౌడ్ గురువారం రాజీనామా చేశారు. పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తించడం లేదని ఆరోపించారు. ఇతర పార్టీల నుంచి చేరినవారికి ప్రాధాన్యమిస్తూ కార్యకర్తల మనోభావాలను దెబ్బ తీస్తున్నట్లు తెలిపారు. తిరుపతిరెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నామని, త్వరలోనే తన భవిష్యత్ నిర్ణయాన్ని ప్రకటిస్తామని వెంకట్‌గౌడ్ పేర్కొన్నారు.

లారీ, బైక్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి

మిరుదొడ్డి, అక్టోబర్ 5 : లారీ, బైక్ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలకేంద్రం మిరుదొడ్డిలో గురువారం జరిగింది. ఎస్సై వై.నరేశ్ తెలిపిన వివరాలు...మిరుదొడ్డికి చెందిన పిట్ల శ్రీనివాస్ (48) ఉదయం బోరుబావి వద్ద పనులు ముగించుకొని బైక్‌పై వస్తున్నాడు. పట్టణ శివారులోకి బొమ్మరాజు చెరువు కట్ట మధ్యలో మిరుదొడ్డి మీదుగా లింగుపల్లి గ్రామం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో బైక్‌పై నుంచి శ్రీనివాస్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లలిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గీతంలో ఏరోక్లబ్ ప్రారంభం

■ ఏరోస్పేస్‌లో ఆవిష్కరణలు రావాలి ■ స్కైరూట్ డైరెక్టర్ డాక్టర్ సీవీఎస్ కిరణ్

విద్యార్థులతో మాట్లాడుతున్న స్కైరూట్ ఏరోస్పేస్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్

పటాన్‌చెరు, అక్టోబర్ 5 : గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో గురువారం ఏరోక్లబ్(జీఏసీ)ను స్కైరూట్ ఏరోస్పేస్ డైరెక్టర్(పరిశోధన – అభివృద్ధి, వ్యూహాలు) డాక్టర్ వెంకటసాయికిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏరోస్పేస్ రంగంలో విద్యార్థుల ఉన్నతికి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ఏరోక్లబ్ ఏర్పాటు చేశారన్నారు. ఏరోస్పేస్‌పై అవగాహన కల్పించడం, ప్రయోగాత్మక అనుభవాల విశ్లేషణ, వివిధ రంగాల్లో విద్యార్థుల వృద్ధిని ప్రోత్సహించాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు. డాక్టర్ సీవీఎస్ కిరణ్ మాట్లాడుతూ విశ్వసనీయత ప్రాముఖ్యత, ఏరోస్పేస్‌లో స్థిరమైన ఆవిష్కరణాల అవసరాన్ని వివరించారు. పుస్తక జ్ఞానాన్ని జీవితానికి అనుసంధానం చేయాలని, ఇంజినీరింగ్‌లోని వివిధశాఖల విద్యార్థులతో నెట్‌వర్క్ అభివృద్ధి చేయాలన్నారు. విజయాన్ని సాధించడంలో టీం వర్క్, నాయకత్వ లక్షణాలు, పారదర్శకత ముఖ్యమన్నారు. స్టెమ్ విద్యను ప్రోత్సహించాలని కోరారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి మాట్లాడుతూ గీతం ఏరోక్లబ్ విద్యార్థుల భవిష్యత్, దేశాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ అసోసియేట్ డైరెక్టర్ ఎసీతారామయ్య, ఏరోస్పేస్ విభాగాధిపతి డాక్టర్ వి.హిమబిందు, అధ్యాపకులుఎస్.కిశోర్‌కుమార్, ఎ.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

'తారా'లో గణితంపై వర్క్‌షాప్

■ తారా ప్రభుత్వ కళాశాలలో రెండు రోజుల జాతీయస్థాయి శిక్షణ

మాట్లాడుతున్న తారా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 5 : కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంటీటీఎస్ (మ్యాథమెటిక్స్ ట్రైనింగ్ అండ్ టాలెంట్ సెర్చ్)కు దేశవ్యాప్తంగా 32 కళాశాలలు ఎంపిక కాగా, తెలుగు రాష్ట్రాల్లో కేవలం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల ఎంపిక కావడం సంతోషంగా ఉన్నదని ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అన్నారు. తారా కళాశాలలో గురువారం గణిత విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల(ఎంటీటీఎస్) శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఎంటీటీఎస్ జాతీయ స్థాయి శిక్షణలో భాగమన్నారు. డిగ్రీ విద్యార్థులకు గణితశాస్త్రంపై ఆసక్తిని పెంపొందించడమే వర్క్‌షాప్ లక్ష్యమని తెలిపారు. గణితానికి సంబంధించిన ప్రతి అంశాన్ని అవగాహన చేసుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. శిక్షణకు వివిధ కళాశాలలకు చెందిన 10 మంది అధ్యాపకులు, 15 మంది విద్యార్థులతో పాటు తారా కళాశాలకు చెందిన 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రధాన వక్తలుగా ఉత్తర్‌ప్రదేశ్ (నోయిడా)లోని శివనాడార్ విశ్వవిద్యాలయానికి చెందిన సత్యనారాయణరెడ్డి, త్రిపుర విశ్వవిద్యాలయానికి చెందిన ఎస్.భట్టాచార్య, తారా కళాశాల గణితశాస్త్ర విభాగధిపతి డాక్టర్ ఉపేందర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ విశ్వేశ్వరశర్మ, అధ్యాపకులు నాగరాజు, అనిల్ కుమార్, వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.